హైదరాబాద్‌లో ప్రైవేట్ బస్సును తనిఖీచేస్తున్న రవాణాశాఖ అధికారులు

250కి పైగా ట్రావెల్స్ బస్సులపై కేసు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న 250కి పైగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసినట్టు రవాణాశాఖ కమిషనర్ శనివారం వెల్లడించారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో అధికారుల బృందాలు విస్తృత తనిఖీలు చేశాయని పేర్కొన్నారు. పర్మిట్ రూల్స్‌కు విరుద్ధంగా సరుకులు తీసుకెళ్తున్న వాహనాలు, అనుమతుల్లేకుండా ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. తనిఖీలు మున్ముందూ కొనసాగుతాయని పేర్కొన్నారు.

రద్దీ నేపథ్యంలోనే కొరడా..

నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై కేసులు నమోదు చేశామని రవాణాశాఖ అధికారులు చెప్తుంటే.. ఇంతకాలం ఉదాసీనంగా ఉండి ఇప్పుడే తనిఖీలు చేపట్టడం ఏంటని ట్రావెల్స్ అసోసియేషన్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ అదనపు బస్సులను నడుపడమే గాకుండా 50 శాతానికి పైగా చార్జీలను వసూలు చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రైవేట్ బస్సులను నియంత్రించేందుకు తనిఖీల పేరిట తమను ఇబ్బంది పెడుతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అడుగుపెట్టలేనంత రద్దీ

- ప్రయాణికులతో రైల్వేస్టేషన్లు, రైళ్లు ఫుల్
- ప్రత్యేక రైళ్ల పేరిట చార్జీల దోపిడీ!

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉంటున్న కుటుంబాలు సొంతూళ్లకు బయల్దేరాయి. ప్రధానంగా ఏపీకి వెళ్లే ప్రయాణికులతో రైల్వేస్టేషన్లు కిక్కిరిసిపోతున్నాయి. మరోవైపు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు అంచనా వేయలేకపోయారు. రిజర్వేషన్ బోగీల ఏర్పాటుకు ప్రాధాన్యతనిచ్చిన అధికారులు, జనరల్ బోగీలు మాత్రం అరకొరగా ఏర్పాటు చేయడంతో రద్దీ పెరిగింది. ఈ క్రమంలో చిన్నారులు, వయోవృద్ధులు, మహిళలు, గర్భిణులు రైలు ఎక్కడం, దిగటంతోపాటు జనరల్ బోగీల్లో కాలు పెట్టేందుకు కూడా స్థలం లేకుండా పోయిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ నేపథ్యంలో సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన రైల్వే అధికారులు ఏమీ పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైళ్లతోపాటు సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, చర్లపల్లి రైల్వే స్టేషన్లలో సౌకర్యాలపైనా ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ రైళ్లను పెంచకుండా ప్రత్యేక రైళ్ల పేరిట సాధారణ టిక్కెట్ చార్జీలపై 30శాతానికి పైగా అదనపు చార్జీలు వసూలు చేయటంపై పలువురు విమర్శిస్తున్నారు. కాగా, పండుగ నేపథ్యంలో దాదాపు 300లకు పైగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

హైవేలపై వాహనాల బారులు

సంక్రాంతికి సొంతూళ్ల బాట పట్టిన పట్నం

చౌటుప్పల్/బీబీనగర్/కేతేపల్లి/ అలంపూరు చౌరస్తా/దేవరకద్ర, జనవరి 11 : సంక్రాంతి సెలవులు రావడంతో హైదరాబాద్‌లో నివసించే వారు బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో సొంతూళ్లకు బయలుదేరడంతో శనివారం రహదారులు రద్దీగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విజయవాడ– హైదరాబాద్, హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారులు వాహనాలతో బారులుదీరాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ ప్లాజా, యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీతో ట్రాఫిక్ నెలకొన్నది. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం పుల్లూరు టోల్ ప్లాజా వద్ద 3 కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులుదీరాయి.

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

సంక్రాంతికి సర్కారు చీరలేవి?

- బతుకమ్మ చీరల పథకం రద్దు చేసిన ప్రభుత్వం
- ఎస్‌హెచ్‌జీ మహిళలకు రెండు చీరలిస్తామని హామీ
- వేదికలపై సీఎం రేవంత్, మంత్రి సీతక్క ప్రకటనలు
- పండుగ వచ్చినా చీరల పంపిణీ ఊసెత్తని ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): స్వయం సహాయక సంఘాల్లోని 63 లక్షల మంది మహిళలకు సంక్రాంతి పండుగకు మంచి డిజైన్లతో మన్నికైన రెండు చీరలు పంపిణీ చేస్తామని ప్రకటించిన సర్కారు మాట తప్పిందని మహిళల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది. రెండు రోజుల్లో సంక్రాంతి పండుగ ఉంది. కానీ చీరల పంపిణీ ముచ్చట ఏమైందో ప్రభుత్వం నుంచి ఒక్క ప్రకటన కూడా లేదు. కనీసం నేతకార్మికులకు ఆర్డర్లు ఇవ్వలేదు. సీఎం రేవంత్, మంత్రి సీతక్క చెప్పిన మాటలు మభ్యపెట్టే హామీలే అయ్యాయని ఎస్‌హెచ్‌జీ మహిళలు మండిపడుతున్నారు.

ఆర్డర్లపై సర్కారు అలక్ష్యం

కోటికి పైగా చీరల కోసం 450 కోట్లు అవసరమని, తయారీకి 4 నెలలకు పైగా సమయం పడుతుందని నేతకార్మికులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోటి చీరల తయారీ కోసం దసరాకు 6 నెలల ముందే నేత కార్మికులకు ఆర్డర్లు ఇచ్చి, 350 కోట్లు మంజూరు చేసేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు పంపిణీని రద్దు చేసింది. సంక్రాంతికి రంగురంగుల చీరలు ఇస్తామని చెప్పింది. గత డిసెంబర్ 19న మహిళా సంఘాల నాయకులను పిలిచి డిజైన్లను ఎంపిక చేసినట్టు చెప్పింది. కానీ నిధులు మాత్రం మంజూరు చేయలేదు, తయారీ కోసం ఆర్డర్లు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం సంక్రాంతికి చీరలు పంపిణీ చేస్తుందని మహిళలు, తయారీకి ఆర్డర్లు ఇస్తే ఉపాధి లభిస్తుందని నేత కార్మికులు ఆశించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనలపై ఆశపెట్టుకున్నందుకు నిరాశే మిగిలిందని నిట్టూరుస్తున్నారు.

రంగురంగుల చీరలిస్తాం

"గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలు కట్టుకునేంతా నాణ్యతతో లేవు. వాటి మీద పెట్టాల్సినంత పెట్టుబడి పెట్టలేదు. స్వయం సహాయక సంఘాల్లో 63 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నరు. మంచి డిజైన్లతో ఒక్కొక్కరికీ రెండు చీరల చొప్పున 1.3 కోట్ల చీరలు ఆర్డర్ చేస్తం. త్వరలోనే మహిళలందరికీ మన్నికైన చీరలు పంపిణీ చేస్తం."

– 2024 సెప్టెంబర్ 9న హైదరాబాద్ లలితాకళాతోరణంలో ఐఐహెచ్‌టీ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ

ఆర్డర్లిచ్చుడే ఆలస్యం

"బతుకమ్మ పండుగకు చీరలు ఇవ్వలేకపోయాం. వచ్చే సంక్రాంతికి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లతో పాటు మహిళా సంఘాల్లోని 63 లక్షల మంది సభ్యులకు రెండు నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తాం. ఇందుకు డిజైన్లను ఎంపిక చేసి వెంటనే ఆర్డర్లిస్తాం."

– 2024 నవంబర్ 4న అంగన్‌వాడీలు, హెల్పర్ల మీటింగ్‌లో సీతక్క హామీ

రేపటి నుంచి కైట్ ఫెస్టివల్

- పరేడ్‌గ్రౌండ్స్‌లో మూడ్రోజులపాటు నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

హరితప్లాజాలో కైట్ ఎగురవేస్తున్న జూపల్లి

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 13 నుంచి 15 వరకు అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. శనివారం బేగంపేట హరితప్లాజాలో కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఉత్సవాల్లో 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్లు, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్, పర్యాటకశాఖ సంచాలకుడు జెండగే హనుమంతు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్ సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్ పాల్గొన్నారు.

జైళ్లో పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటా

- గ్యారెంటీలు అమలయ్యేవరకు పోరాటం చేస్తా
- రుణమాఫీ కాలే, తులం బంగారం ఇయ్యలే
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, జనవరి 11 : తనను జైలులో పెట్టినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేవరకు ప్రశ్నిస్తూనే ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన హనుమకొండ జిల్లా కమలాపూర్ రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో సీఎం రేవంత్ విఫలమైనట్టు ఆరోపించారు. ప్రజల కోసం కొట్లాడుతున్నందుకే తనపై కేసులు పెడుతున్నాడని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని స్పష్టంచేశారు. కేసీఆర్ పెట్టిన కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారం కలిపి వందరోజుల్లో ఇస్తామని హామీ ఇచ్చి, ఏడాది గడిచినా అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. 50 శాతం రుణమాఫీ కాలేదని, రైతు భరోసా ఆం క్షలు లేకుండా రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటానని హెచ్చరించారు.

రోడ్డు దాటితేనే ర్యాలీ అవుతుందా?

సీఎం రోడ్లనే బ్లాక్ చేస్తే కేసులుండవా?: దాసోజు ఫైర్

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): పదిఅడుగుల దూరం రోడ్డు దాటినందుకు అనధికార ర్యాలీ నిర్వహించారని కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. 9న కేటీఆర్‌పై పనికిమాలిన ఎఫ్ఐఆర్ నమోదు చేశారని శనివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీకార ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. డిసెంబర్ 18న రాజ్‌భవన్, 19న ఈడీ ఆఫీస్ ముందు వేలాది మందితో నిరసనలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించారని గుర్తుచేశారు. ఈ నిరసనలపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. సీఎం నిరసన ఫొటోల క్లిప్పింగులను ఆయన ఎక్స్ ఖాతాలో జతచేశారు. రాజకీయ ప్రతీకారం కోసం పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం ప్రజల విశ్వాసం, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందని మండిపడ్డారు. ఇదంతా కనిపించడంలేదా? అంటూ డీజీపీ, హైదరాబాద్ సీపీ, కమిషనర్‌కు ఆయన తన ట్వీట్‌ను ట్యాగ్ చేశారు.

డీజిల్ ఖర్చులకే టికెట్ ధరల పెంపు

టీజీఎస్ ఆర్టీసీ వెల్లడి

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ బస్సులకు ఐదు రోజులపాటు టికెట్ ధరలను సవరించినట్టు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిపే ప్రత్యేక బస్సులు నడిపేందుకు డీజిల్ ఖర్చులు, నిర్వహణ కోసమే టికెట్ ధరలు పెంచినట్టు శనివారం తెలిపింది. 2023లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 16 ప్రకారమే నిర్ణయం తీసుకున్నామని, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

అప్పుడే రోజంతా హాయిగా ఉంటుంది!

'జయాపజయాల గురించి నేను అంతగా పట్టించుకోను. కెరీర్‌లో ఎన్నో విజయాలు చూశాను. ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో కూడా నేను నిత్య విద్యార్థినే అనుకుంటున్నా. ప్రతీ సినిమాకు కొత్తగా ఏదో ఒకటి నేర్చుకుంటున్నా. సినిమా ఫలితం గురించి ఆలోచించకుండా నాకు అప్పజెప్పిన పనిని వందశాతం అంకితభావంతో నిజాయితీగా పూర్తి చేయాలన్నదే నా సిద్ధాంతం' అన్నారు అగ్ర నటుడు వెంకటేష్. ఆయన కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేష్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

- సంక్రాంతికి చక్కటి వినోదాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకురావడం ఆనందంగా ఉంది. ఈ కథలో చిన్న క్రైమ్ ఎలిమెంట్ కూడా ఉండటంతో కొన్ని సన్నివేశాలు ఉత్కంఠభరితంగా సాగుతాయి. మాజీ పోలీస్, అతని భార్య, మాజీ ప్రేయసి మధ్య ఆసక్తికరంగా నడిచే క్రైమ్ ఫ్యామిలీ డ్రామా ఇది. ఆద్యంతం వినోదంతో పాటు అక్కడక్కడా ఉత్కంఠను కలిగించే సన్నివేశాలతో ఈ సంక్రాంతికి పర్‌ఫెక్ట్ మూవీ అనిపించుకుంటుంది.
- ఎన్నడూలేనంతగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఎక్కువగా పాల్గొన్నానని చాలా మంది అంటున్నారు. అది అనుకోకుండా జరిగింది. ఈ సినిమా మ్యూజిక్ బాగా వచ్చింది. స్వతహాగా నాకు డ్యాన్సులు ఇష్టం ఉండటంతో.. ట్యూన్స్ వినగానే జోష్ అనిపించింది. అందుకే ప్రమోషన్ కార్యక్రమాల్లో మా టీంతో పాటు నేను కూడా ఉత్సాహంగా పాల్గొన్నా. చక్కటి డ్యాన్సులు, సరదా సంగతులతో ప్రమోషనల్ ఈవెంట్స్ బాగా జరిగాయి.
- 'గోదారి గట్టు' పాట 85 మిలియన్ వ్యూస్ క్రాస్ చేయడం ఆనందంగా ఉంది. భీమ్స్ బెస్ట్ మ్యూజిక్ ఇచ్చాడు. ఇందులో నేను పాడిన 'పొంగల్' సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వస్తున్నది. రాత్రి రెండు గంటలకు ఆ పాట విన్నప్పుడు తెలియకుండానే డ్యాన్స్ చేశాను. ఆ పాట చాలా క్రేజీగా అనిపించింది. దాంతో నేను పాడతానని చెప్పా. నేను పాడిన రోజు నా గొంతు బాగుంది. ఇంగ్లీష్ పదాలు ఎక్కువగా ఉండటంతో పాట ఈజీ అయ్యింది (నవ్వుతూ).
- 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమా నుంచి దిల్‌రాజుగారితో నా ప్రయాణం కొనసాగుతున్నది. వారి బ్యానర్‌లో సినిమా చేయడం చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది. మేమిద్దరం కలిసి చేసిన సినిమాలన్నీ బాగా ఆడాయి. నాన్నగారి సినిమాల ప్రొడక్షన్స్ వ్యవహారాలు చూసిన అనుభవం ఉండటం వల్ల నిర్మాతల కష్టనష్టాలపై మంచి అవగాహన ఉంది. అందుకే ఏ బ్యానర్‌లో నటించినా సొంత సంస్థలాగానే భావిస్తా. అందరూ హ్యాపీగా ఉండాలని కోరుకుంటా.
- పాజిటివ్ ఆలోచనతో రోజు మొదలుపెడితే ఆ రోజంతా హాయిగా ఉంటుంది. మన ఆధీనంలో లేని విషయాల గురించి ఎక్కువగా ఆలోచించొద్దన్నదే నా ఫిలాసఫీ. ఈ విషయాన్ని ఎప్పుడూ చెబుతుంటాను. మన వృత్తి విషయంలో నిజాయితీ, నిబద్ధతతో ఉంటే చాలు. ఫలితం గురించి ఎక్కువగా ఆలోచించొద్దు. 'రానా నాయుడు–2' మార్చిలో రావొచ్చు. డబ్బింగ్ పూర్తయింది. నా తదుపరి సినిమాలకు సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. అన్నీ ఫైనలైజ్ అయ్యాక వివరాలను వెల్లడిస్తా.

ఆఫ్రికన్ తెగలమధ్య 20 రోజులు

మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29'(వర్కింగ్ టైటిల్)కి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇటీవల జరిగిన విషయం తెలిసిందే. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో ట్రజర్ హంట్ కథాంశంతో రూపొందనున్న ఈ సినిమా కోసం మహేశ్‌బాబు పలు యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకుంటున్నారు. రాజమౌళి ఆదేశానుసారం జపాన్‌లో కొన్ని రోజులపాటు ఆయన మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారట. అలాగే ఆఫ్రికాలోని మసాయి–పిగ్మీస్ తెగల మధ్య ఆ ప్రాంతపు యుద్ధ విద్యలపై బేసిక్ స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్టు తెలుస్తున్నది. అంటే ఓ 20రోజుల పాటు మహేష్ ఆఫ్రికన్ తెగల మధ్య గడిపారన్నమాట. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ నెల ద్వితీయార్ధంలో ఆయన చైనా వెళ్తున్నారట. అక్కడ మార్షల్ ఆర్ట్స్‌కి చెందిన ప్రత్యేక నిపుణుల ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటారని సమాచారం. మొత్తంగా రాజమౌళి సినిమాకోసం మహేష్ చెమటలు కక్కిస్తున్నారని తెలుస్తున్నది.

హాలీవుడ్‌కు దీటైన సాంకేతికత

'తెలుగు సినిమా బాలీవుడ్, హాలీవుడ్‌తో పోటీ పడుతున్నది. రాబోయే కాలంలో హాలీవుడ్‌కు ధీటుగా ఎదగాలన్నా, తక్కువ బడ్జెట్‌తో అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌ను తెరపై ఆవిష్కరించాలన్నా ఇలాంటి వీఎఫ్ఎక్స్, ఏఐ టెక్నాలజీ అవసరం ఎంతైనా ఉంది.' అని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. కల్పర వీఎఫ్ఎక్స్ అండ్ ఏఐ టెక్నాలజీ సర్వీస్‌ను హైదరాబాద్‌లో డాక్టర్ మల్లీశ్వర్ లాంచ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హరీష్‌రావు పై విధంగా స్పందించారు ఇంకా మాట్లాడుతూ 'అమెరికాలో స్థిరపడి ఎంటర్‌ప్రెన్యూర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు మల్లీశ్వర్. తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని నేను ఆహ్వానిస్తే.. సిద్ధిపేటలో ఐటీ కంపెనీ స్థాపించి ఎంతో మంది గ్రామీణ యువతకు ఉద్యోగాలు ఇచ్చిన గొప్ప వ్యక్తి డాక్టర్ మల్లీశ్వర్. ప్రస్తుతం ప్రపంచమంతా ఏఐ వెంట పడుతున్నది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చిన మల్లీశ్వర్‌కు నా అభినందనలు తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు హరీష్‌రావు. కల్పర వీఎఫ్ఎక్స్, ఏఐ సర్వీసెస్ సీఈవో మల్లీశ్వర్ మాట్లాడుతూ 'యూస్‌లో నాకు ఐటీ కంపెనీలున్నాయి. ఏఐ ద్వారా అక్కడ కొన్ని ప్రొడక్ట్స్ డెవలప్ చేశాం కూడా. వీఎఫ్ఎక్స్ ప్రాధాన్యత ఉన్న సినిమాలు ఇక్కడ ఎక్కువగా రూపొందుతున్నాయి. అందుకే హాలీవుడ్ టెక్నాలజీని టాలీవుడ్‌కి అందించాలని ఈ సర్వీస్‌ని ఇక్కడ స్టార్ట్ చేశాం. ఈ టెక్నాలజీ ఎంతవరకు ఉపయోగపడుతుందో దర్శకులు రాజమౌళి, నాగ్‌అశ్విన్‌లకు బాగా తెలుసు. టాలీవుడ్‌తోపాటు సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కూడా మా వంతు పాత్ర పోషిస్తాం' అని తెలిపారు. ఇంకా దర్శకుడు కరుణకుమార్, రఘుకుంచె, పీపుల్ మీడియా డైరెక్టర్ వందన, నటుడు విక్రాంతిరెడ్డి కూడా మాట్లాడారు.

ఇద్దరూ పని రాక్షసులే..

'50ఏండ్ల బాలకృష్ణగారి కెరీర్లో వందకు పైగా సినిమాలు చేస్తే.. వాటిలో గుర్తుండిపోయే సినిమాలు కొన్ని ఉంటాయి. వాటి లిస్ట్‌లో 'డాకు మహారాజ్' చేరుతుంది. చక్కని కథ, కథనాలతోపాటు హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్ 'డాకు మహారాజ్' సొంతం.' అన్నారు దర్శకుడు బాబీ కొల్లి. ఆయన దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. సంక్రాంతి కానుకగా ఆదివారం(నేడు) ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా బాబీ శనివారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. 'బాలకృష్ణగారి ఇమేజ్‌ని, ఆయన సినిమాపై అభిమానుల్లో ఉండే అంచనాలనూ దృష్టిలో పెట్టుకొని 'డాకు మహారాజ్' తీశాను. మునుపెన్నడూ చూడని కొత్త బాలయ్యను ఈ సినిమాలో చూస్తారు.' అని తెలిపారు బాబీ. దర్శకుడికి బాలకృష్ణ ఎంతో గౌరవం ఇస్తారని, అభిమానులకోసం డూప్ లేకుండా నటిస్తారని, మొండిగా ఆయన గుర్రాన్ని కంట్రోల్ చేసే తీరును చూసి ఆశ్చర్యమేసిందని, అలాగే ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి పనిచేశారని బాబీ చెప్పారు. 'చిరంజీవి, బాలకృష్ణ వంటి టాప్ స్టార్లతో పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. సినిమా విషయంలో వారిద్దరూ ఒకేలా ఉంటారు. ఇద్దరిలో క్రమశిక్షణ ఉంటుంది. ఇద్దరూ పనిరాక్షసులే. నిర్మాతలకు నష్టం రాకూడదనే ఉద్దేశంతో పనిచేస్తారు. సినిమాకోసం నిరంతరం శ్రమిస్తారు. అలాగే వెంకటేష్ గారు కూడా. వారి నుంచి చాలా నేర్చుకున్నా' అని తెలిపారు బాబీ.

అది నా అదృష్టం

పన్నెండేళ్ల క్రితం విశాల్‌తో వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన 'మదగజరాజ' సినిమా సమస్యలన్నింటినీ దాటుకొని ఇన్నాళ్లకు సంక్రాంతి కానుకగా ఆదివారం(రేపు) విడుదల కానుంది. ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్‌కుమార్ విలేకరులతో ముచ్చటించింది. ' 'మదగజరాజ' నా రెండో సినిమా. దర్శకుడు సుందర్.సి సెట్‌లో నాకు నటనలో మళకువలు నేర్పేవారు. చాలా సరదాగా షూటింగ్ జరిగింది. ఈ సినిమా విషయంలో విశాల్ కూడా చాలా కష్టపడ్డారు. ఈ పాత్రకోసం ఆయన సిక్స్‌ప్యాక్ చేశారు. నిర్మాణంలో ఉన్నప్పుడే ఈ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కానీ విడుదల నోచుకోలేదు. ఎట్టకేలకు ఇన్నాళ్లకు సినిమా విడుదలవుతున్నందుకు ఆనందంగా ఉంది.' అన్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. తన వైవాహిక జీవితం గురించి చెబుతూ 'నికోలయ్ సచ్‌దేవ్ లాంటి వ్యక్తి భర్తగా దొరకడం నా అదృష్టం. ఫ్యామిలీ లైఫ్‌కి తను ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. కుటుంబ సభ్యులతో నాకంటే ఎక్కువ తనే కాంటాక్ట్‌లో ఉంటారు. మా అమ్మానాన్న కూడా అన్ని విషయాలనూ నాతోకంటే తనతోనే ఎక్కువ షేర్ చేసుకుంటారు ' అంటూ చెప్పుకొచ్చింది వరలక్ష్మి.

ఒగ్గు కళాకారుల 'బ్రహ్మాండ'

సీనియర్ నటి ఆమని ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బ్రహ్మాండ'. మమత ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై దాసరి సురేష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు రాంబాబు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తెలంగాణ జానపద కళారూపం ఒగ్గు కథ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఒగ్గు కళాకారుల నేపథ్యంలో వస్తున్న తొలి సినిమా ఇదే. డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుంది. ఆమని నటన ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే భావోద్వేగభరితమైన సినిమా ఇదని హీరో బన్నీ రాజు అన్నారు. జయరామ్, కొమరం బన్నీ రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కాసుల కార్తీక్, సంగీతం: వరికుప్పల యాదగిరి, మాటలు: రమేష్ రాయి, జీఎస్ నారాయణ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రాంబాబు.

లింగ సమానత్వం నేపథ్యంలో

ఆదర్శ్ పుందిర్, అశ్రీత్ రెడ్డి, ప్రియాంకసింగ్, పూజిత పుందిర్, రాజ్‌గౌడ్, సునందిని, మధుసూదన్ ప్రధాన పాత్రధారులుగా ఓ చిత్రం రూపొందుతున్నది. సాంకేతికత, భావోద్వేగాలు, లింగ సమానత్వం..ఈ మూడింటి నేపథ్యంలో సాగే ఈ సినిమాకు ఘంటసాల విశ్వనాథ్ దర్శకుడు. వేణుబాబు.ఏ నిర్మాత. యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. ఇదో వైవిధ్యమైన కథాంశమని, అందరికీ నచ్చేలా సినిమా ఉంటుందని, డిసెంబర్ 26న షూటింగ్ మొదలుపెట్టి, పదిహేను రోజుల్లో సగం షూట